పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప, నాయకులు

స్మార్ట్ మీటర్ల బిగింపు చర్యలు ఉపసంహరించుకోవాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ప్రజలపై భారాలు మోపేలా ప్రభుత్వం ప్రవేశపెట్టిన విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించే చర్యలు ఉపసంహరించుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం బుక్కరాయసముద్రం మండల పరిధిలోని పలు గ్రామాల్లో సిపిఎం ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి విద్యుత్ భారాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్మార్ట్ మీటర్ల వల్ల తలెత్తే సమస్యలను వివరించారు. స్మార్ట్ మీటర్లను తిరస్కరిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు వినతి పత్రం అందించేలా క్యూ ఆర్ కోడ్‌ను కలిగిన కరపత్రాలను ఆవిష్కరించి ప్రజలకు అందించారు. ఈ సందర్భంగా ఓ.నల్లప్ప మాట్లాడుతూ అదానీ కంపెనీ వారు స్మార్ట్ మీటర్ బిగించడానికి వస్తున్నారని, గుట్టు చప్పుడు కాకుండా ముందు కార్యాలయాలకు ఆ తర్వాత వ్యాపార సంస్థలకు, షాపులకు మీటర్లు బిగించారని తెలిపారు. ఇప్పుడు అనుమతి లేకుండా, మోసపు మాటలు చెప్పి, బెదిరించి ఇళ్లకు మీటర్లను మార్చుతున్నారని తెలిపారు. ఈ మీటర్ల వల్ల ఇప్పటికంటే ప్రజలపై విపరీతమైన భారాలు శాశ్వతంగా పడతాయని తెలిపారు. మీటర్ల బిగింపును ఆదిలోనే అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. లేకపోతే ప్రీ పెయిడ్ విధానంలో విద్యుత్ వినియోగించే దుస్థితిని పాలకులు కల్పిస్తారని తెలిపారు. కొత్తగా పెట్టే మీటర్ ఖర్చు వినియోగదారులే చెల్లించేందుకు కుట్ర చేస్తున్నారని తెలిపారు. సింగిల్ ఫేజ్ రూ.8,927లు, 3 ఫేజ్ రూ.17,286లు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ మొత్తాన్ని రానున్న 93 నెలల్లో మీటర్ అద్దె పేరుతో వినియోగదారుల నుంచి నెలవారి వాయిదాలలో వసూలు చేస్తారని తెలిపారు. కరెంటు చార్జీలు తగ్గిస్తామని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం తొమ్మిది నెలల్లోనే రూ.15,486 కోట్లు సర్దుబాటు చార్జీల రూపంలో భారం వేసింది. గత వైసిపి ప్రభుత్వ బాటలోనే ఈ ప్రభుత్వం నడుస్తోందన్నారు. ప్రజలు విద్యుత్ భారాలను గ్రహించి కరపత్రంలో ఉన్న క్యూఆర్ కోడ్‌ను గూగుల్ నుండి స్కాన్ చేసి మెయిల్ ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రికి, సంబంధింత విద్యుత్ అధికారులకు కరెంట్ స్మార్టు మీటర్ పెట్టొద్దు, ట్రూఅప్ చార్జీలు రద్దు చేయాలి, సెకీ ఒప్పందాలను రద్దు చేయాలని విజ్ఞాపనలు పంపాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం బుక్కరాయసముద్రం మండల కార్యదర్శి ఆర్.కుళ్లాయప్ప, మండల కమిటీ సభ్యులు నాగేంద్ర, నెట్టికంటయ్య, చెన్నప్ప, నడిపక్క, సాలమ్మ, పెద్దన్న, పెద్ద భూషి, చిన్న భూషి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీల్లో పని చేస్తున్న ఇంజినీరింగ్ కార్మికులు ఆదివారం అర్ధరాత్రి నుంచి సమ్మెలోకి వెళ్లారు. ఇందులో భాగంగా జిల్లాలోని మున్సిపాలిటీల్లో కార్మికులు దీక్ష శిబిరాలు వేసి సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనంతపురంలోని మున్సిపల్ కార్యాలయం ముందు ఏర్పాటు చేసిన సమ్మెలో మాట్లాడుతున్న సిఐటియు మున్సిపల్ యూనియన్ నాయకులు

చినుకు రాలదు.. సాగు సాగదు...



కలవరపెడుతున్న తొలకరి
వాన కోసం అన్నదాతల ఎదురుచూపు
ఖరీఫ్ సాగుపై రైతుల్లో దిగులు

ఆదిలోనే హంసపాదు అన్నట్టుగా ఉంది ఈ ఏడాది తొలకరి పరిస్థితి. మృగశిర కార్తెలో భారీ వర్షాలు పడతాయని ఆశించిన రైతుకు నిరాశే మిగిలింది. ఎండలు రోహిణి కార్తెను తలపిస్తున్నాయి. చినుకు జాడ లేదు. వరుణుడు కరుణించటం లేదు. తీవ్రమైన ఎండ, వేడి గాలుల వల్ల పొలాల్లో పైపదును పూర్తిగా ఆరిపోయింది. సకాలంలో వానలు కురుస్తాయని ముంగారుకు సిద్ధమైన రైతులకు నిరాశే ఎదురైంది. వర్షం కోసం రైతులు ఆకాశం వైపు వేయికళ్లతో ఎదురు చూస్తున్నారు.

ప్రజాశక్తి-పెనుకొండ

మురిపించిన ముందస్తు వర్షాలు

గతేడాది కంటే ఉమ్మడి అనంత జిల్లాలో ఈ ఏడాది రోహిణి కార్తెలో భారీ వర్షాలు పడటం.. పంట పొలాలు పదును కావటం, వాతావరణం చల్ల బడటం. ముందుగానే తొలకరి రావటంతో జిల్లాలో రైతులు ఎంతో సంబరపడ్డారు. అయితే ఇప్పుడు జులై వచ్చినా వరుణుడు కరు ణించడం లేదు. కారుమబ్బులు కమ్ముకుంటున్నా బలమైన గాలులతో మేఘాలను తరిమేస్తున్నాయి. దుక్కులు చేసుకుని సిద్ధంగా ఉన్న అన్నదాతలు నిత్యం ఆకాశం వైపు చూస్తున్నారు. మే చివరి వారంలో కొద్దిమంది వేరుశనగ విత్తారు. జూన్‌లో చినుకు జాడలేదు. కంది, మొక్కజొన్న, పత్తి, ఆముదం, సజ్జ తదితర చిరుధాన్యాలను తొలకరిలో విత్తనం వేశారు. విత్తనాలు సజావుగానే మొలకెత్తాయి. చినుకు పడలేదు. ఎండలు వేసవిని తల పిస్తున్నాయి. పగటి ఉష్ణోగ్రత 40 డిగ్రీల సెంటీగ్రేడుకు తగ్గటం లేదు. దీనికితోడు బలమైన గాలులు వీస్తు న్నాయి. ఎండ గాలుల వల్ల పొలాల్లో పైపదును పూర్తిగా ఆరిపోయింది. మొలిచిన మొక్కలు వడలిపోతున్నాయి. వేరుశనగ, సజ్జ, కంది పైర్లు ఎదుగుదల లోపించి నేలను అంటిపెట్టుకున్నాయి. వర్షం కోసం రైతులు ఆకాశంవైపు చూస్తున్నారు. పొడి వాతావరణంలో భూమిలో ఉన్న విత్తనాలను పురుగులు తినే స్తాయని రైతులు చెబుతున్నారు. నెలన్నర రోజులుగా వరుణుడు ముఖం చాటేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

రొద్దం మండలంలో దుక్కి దున్ని సాగు కు సిద్ధం చేసిన పొలం

వేసవిలో అత్యధిక వర్షపాతం

ఉమ్మడి జిల్లాలో సాధారణంగా ఏప్రిల్, మే నెలల్లో భారీగా ఉష్ణోగ్రతలు పెరిగాయి. అయితే ఆయా నెలల్లోనే సాధారణం కంటే అత్యధిక వర్షపాతం నమోదు కావడం గమనార్హం. మే చివరి వారంలో నైరుతి రుతుపవనాలు రావడంతో భారీ వర్షాలు కురిసి పంటలకు నష్టం వాటిల్లింది. శ్రీసత్యసాయి జిల్లాలో గతేడాది జూన్‌లో సాధారణంగా 66.6 మిల్లీమీటర్ల వర్షపాతానికి గాను 148.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అనంత జిల్లాలో గతేడాది జూన్‌లో 61.0 మిల్లీమీటర్లు సాధారణ వర్షపాతం కాగా 142 మిల్లీమీటరుల నమోదైంది.

అత్యల్పంగా సాగు

జూన్ ఒకటి నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. అన్ని రకాల పంటల సాధారణ సాగు లక్ష్యం 16,12,991 ఎకరాలు. ఇప్పటి వరకు 47,487 ఎకరాలు సాగయ్యాయి. శ్రీసత్యసాయి జిల్లాలో సాధారణ సాగు లక్ష్యం 6,64,842 ఎకరాలకు గాను 23,449 ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. అనంత జిల్లాలో సాధారణ సాగు లక్ష్యం 8,48,149 ఎకరాలు కాగా అందులో 24,044 ఎకరాలు మాత్రమే సాగైనట్లు వ్యవసాయ శాఖ గణంకాలు చెబుతున్నాయి.

18,700 వేల ఎకరాల్లోనే వేరుశనగ

ఉమ్మడి జిల్లాలో ప్రధాన పంట వేరుశనగ ఇప్పటి వరకు కేవలం 18,786 ఎకరాల్లోనే సాగైంది. ఈనేపథ్యంలో వేరుశనగ రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. వర్షాధారంపై ఆధారపడే రైతులు ఈ ఏడాది వేరుశనగ సాగు చేసేందుకు వెనకడుగు వేస్తున్నారు. కంది 8,653 ఎకరాలు, మొక్కజొన్న 6,714, పత్తి 6,675, ఆముదం 2,595, సజ్జ 1000 ఎకరాలు సాగైనట్లు వ్యవసాయశాఖ గణాంకాలు చెబుతున్నాయి.

వర్షం కోసం ఎదురు చూస్తున్నాం

ఈఏడు ముందుగా వర్షాలు కురిశాయి. రైతులు సాగుకు సిద్ధమైయ్యారు. చివరకు చినుకు పడక

రైతులు నిరాశతో ఆకాశం వైపు చూస్తున్నారు. ఇలాగే కొనసాగితే ఈఏడాది వేరుశనగ సాగు విస్తీర్ణం తగ్గి పోతుంది. పొలాలను దుక్కిచేసి వర్షం కోసం ఎదురు చూస్తున్నాం.

శివయ్య,
రైతు, మావటూరు,
పెనుకొండ మండలం

రెగ్యులర్ వైద్యులు లేక ఇబ్బందులు

ప్రజాశక్తి-నార్పల

నార్పల ప్రాథమిక వైద్యశాలకు రెగ్యులర్ వైద్యులు లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నియోజకవర్గంలోని అతిపెద్ద మండలమైన నార్పలకు రెగ్యులర్ డాక్టర్ లేకపోవడం ఏంటని ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. నార్పల ప్రాథమిక వైద్యశాలలో పని చేస్తున్న వైద్యులు ప్రవీణ్‌కుమార్, సాదియ విధులు నిర్వహించేవారు. అయితే వీరిద్దరూ ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో వేరే ప్రాంతాలకు బదిలీ అయ్యారు. అయితే నూతన వైద్యులు వచ్చేంత వరకూ పాత వైద్యులను ఉంచకుండా ఉన్నతాధికారులు రిలీవ్ చేయడంతో రోగులు అనేక ఇబ్బందులు గురవుతున్నారు. నార్పల వైద్యశాలకు రోజూ కనీసం 150 నుండి 200 మంది దాకా ఓపి రోగులు వస్తుంటారు. వీరందరూ రెగ్యులర్ వైద్యులు లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నార్పల ప్రాథమిక వైద్యశాలకు రెగ్యులర్ వైద్యులను నియమించాలని స్థానికులు కోరుతున్నారు.

నార్పల ప్రాథమిక వైద్యశాల

వీకే. పార్వతమ్మ మృతికి సిపిఎం నివాళి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

జిల్లా కమ్యూనిస్టు ఉద్యమ నాయకుడు వీకే ఆదినారాయణ రెడ్డి సతీమణి వీకే పార్వతమ్మ మృతికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్ ప్రగాఢ సానుభూతి తెలిపారు. తనయావత్ జీవితం కమ్యూనిస్టు ఉద్యమానికి చేదుడుగా నిలిచిన పార్వతమ్మ జీవితం ఆదర్శనీయమన్నారు. కమ్యూనిస్టు పార్టీల కార్యకర్తలను తన పిల్లలుగా భావించి ఆదరించేదన్నారు. సిపిఎం ప్రచురించిన జిల్లా కమ్యూనిస్టు యోధుల పుస్తకావిష్కరణ సభలో పార్వతమ్మ పాల్గొని నేటి తరానికి స్ఫూర్తి వంతంగా నిలిచారని కొనియాడారు. కరోనా సమయంలో సిపిఎం అందించిన సేవలను ఆమె ప్రశంసించి ప్రోత్సహించారని, అలాంటి గొప్ప మాతృమూర్తి మృతి చెందడం పోరాటాలకు తీరని లోటు అన్నారు.

ఏపీకి 'ఓడీ-ఓపీ' అవార్డుల పంట

రాష్ట్రానికి 10 ఓడీ-ఓపీ అవార్డులు
నేడు న్యూఢిల్లీలో అవార్డుల ప్రదానం
మంత్రి సవిత

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సవిత

ప్రజాశక్తి-పెనుకొండ

వన్ డిస్ట్రిక్ట్,వన్ ప్రొడక్ట్(ఓడీ, ఓపీ)కింద ఆంధ్రప్రదేశ్ నుంచి తొమ్మిది ఉత్పత్తులకు అవార్డులు వచ్చినట్లు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. తొమ్మిది ప్రొడక్టుల్లో ఏడు ఉత్పత్తులు చేనేత, హస్త కళలకు చెందినవి కాగా, రెండు వ్యవసాయ రంగానికి సంబంధించినవని వెల్లడించారు. వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్ విభాగంలో జాతీయ స్థాయిలో మూడు రాష్ట్రాలు ఎంపిక కాగా అందులో ఏపీకి మరో అవార్డు వచ్చిందని ఆమె ఆనందం వ్యక్తంచేశారు. ఆదివారం పెనుకొండలోని తన క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మంత్రి సవిత మాట్లాడారు. సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రోత్సాహంతో రాష్ట్రంలో చేనేత పరిశ్రమ, హస్త కళలు అభివృద్ధి దిశగా పరుగులు తీస్తున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహంతో వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడెక్ట్ కింద రాష్ట్రం నుంచి తొమ్మిది ఉత్పత్తులకు కేంద్ర ప్రభుత్వం అవార్డులు ప్రకటించిందన్నారు. వాటిలో ఏడు ఉత్పత్తులు చేనేత, హస్త కళలకు చెందినవన్నారు. వాటిలో విజయనగరం జిల్లా నుంచి బొబ్బిలి వీణ, అనకాపల్లి జిల్లా నుంచి ఏటికొప్పాక బొమ్మలు, కాకినాడ నుంచి పెద్దాపురం సిల్క్ శారీ, బాపట్ల నుంచి చీరాల సిల్క్ శారీ, తిరుపతి నుంచి వెంకటగిరి శారీ, నర్సాపూర్ అల్లికల కుట్టు, సత్యసాయి జిల్లా నుంచి ధర్మవరం పట్టు చీరలు ఉన్నాయన్నారు. వ్యవసాయ రంగం నుంచి గుంటూరు మిర్చి, శ్రీకాకుళం నుంచి జీడిపప్పు ఎంపికయ్యాయన్నారు. ఓడీ ఓపీ విభాగంలో జాతీయ స్థాయిలో ఏపీకి మరో అవార్డు వచ్చినట్లు తెలిపారు. ఏ విభాగంలో అవార్డు వచ్చిందో సోమవారం అవార్డుల ప్రదానోత్సవంలో ప్రకటిస్తారని మంత్రి వెల్లడించారు. న్యూఢిల్లీలోని భారత మండపంలో నిర్వహించే కార్యక్రమంలో ఓడీ-ఓపీ అవార్డులను కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ చేతుల మీదుగా సోమవారం అందజేయనున్నారన్నారు. ఈ అవార్డుల స్వీకరణకు తనతో పాటు ఆయా జిల్లాల కలెక్టర్లు, కళాకారులు ఆదివారం బయలుదేరి వెళుతున్నట్లు మంత్రి తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలోనే రాష్ట్రానికి పది అవార్డు రావడంపై మంత్రి సవిత హర్షం వ్యక్తం చేశారు.

మరిన్ని ఉత్పత్తులకు ఓడీ, ఓపీ

రాష్ట్రంలో మరిన్ని ఉత్పత్తులకు వన్ డిస్ట్రిక్ట్, వన్ ప్రొడక్ట్ గుర్తింపు తీసుకురాడానికి తీవ్రంగా కృషి చేస్తున్నట్లు మంత్రి సవిత వెల్లడించారు. ఇదే విషయమై ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం దృష్టికి సీఎం చంద్రబాబునాయుడు తీసుకెళ్లారన్నారు. కడపలో అరటి, చిత్తూరు టమోటా, అనంతపురం వేరు శనగ ఉత్పత్తులను వన్ డిస్ట్రిక్, వన్ ప్రొడెక్టు కింద ఎంపిక చేసేలా కృషి చేస్తున్నామన్నారు.

అవార్డులతో అమ్మకాలకు ఊతం

రాష్ట్రంలో ప్రతి జిల్లా నుంచి ఓడీ ఓపీ ఉత్పత్తుల ఉండేలా ప్రణాళికలు రచించినట్లు మంత్రి సవిత తెలిపారు. ఇందుకోసం చేనేత, హస్త కళాకారులకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఓడీఓపీ అవార్డులతో రాష్ట్రంలో చేనేత, హస్త కళలకు మరింత ప్రోత్సాహం లభించనుందన్నారు. ఈ అవార్డులు కళాకారుల్లో నూతన ఉత్సాహం తీసుకురావడంతో పాటు ఉత్పత్తుల అమ్మకాలు మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ఓడీఓపీ అవార్డుల సాధన వెనుక సీఎం చంద్రబాబుతో పాటు కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహం ఎంతో ఉందన్నారు.

వచ్చే నెల 7 నుంచి చేనేతలకు ఉచిత విద్యుత్

ఆగస్టు ఏడో తేదీన జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా మగ్గాలున్న చేనేతలకు 200 యూనిట్లు, మరమగ్గాలున్న వారికి 500 యూనిట్లు ఉచిత విద్యుత్ పథకం ప్రారంభించనున్నట్లు మంత్రి సవిత వెల్లడించారు. అదే రోజు త్రిఫ్ట్ ఫండ్ నిధులు విడుదల చేయనున్నామన్నారు. ఎన్నికల ముందు చేనేతలకు ఉచిత విద్యుత్ అందిస్తామని సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ మాటిచ్చిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ చేనేతలకు ఉచిత విద్యుత్ పథకం అమలు చేయబోతున్నామన్నారు.

మరిన్ని ఆప్కో షోరూమ్ ల ఏర్పాటు

చేనేత ఉత్పత్తుల అమ్మకాలు పెంచేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి సవిత తెలిపారు. ఇప్పటికే ఈ కామర్స్ ద్వారా చేనేత వస్త్రాల అమ్మకాలు ప్రారంభించామన్నారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా 97 ఆప్కో షో రూమ్ లున్నాయని, మరిన్ని షో రూమ్ ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ఆప్కో షోరూమ్‌ల ఏర్పాటుతో చేనేత ఉత్పత్తులు మరింత పెరిగే అవకాశముందని, దీనివల్ల నేతన్నలకు ఆర్థిక భరోసా లభిస్తుందని మంత్రి సవిత తెలిపారు.

దేవాలయాల భూముల పరిరక్షణకు చర్యలు

జిల్లా దేవాదాయ శాఖ అధికారి బి. నరసింహరాజు

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

దేవాలయాల క్రింద ఉన్న భూముల పరిరక్షణకు తగిన చర్యలు తీసుకుంటున్నామని ఆ భూములను ఆక్రమించుకున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా దేవాదాయ శాఖ అధికారి బి. నరసింహారాజు తెలిపారు.. ఏ చిన్న దేవాలయం అయినా సరే కొంత భూమి ఉంటుంది. గతంలో రాజుల కాలం నుంచి ఆ దేవాలయాలకు ధూప దీప నైవేద్యం పెట్టడానికి తగిన భూములు కేటాయించారు. ఆ సంప్రదాయం నేటికీ కొనసాగుతోంది. పలు ఆలయాలు ఆలనా పాలనా సరిగా లేక శిథిలావస్థకు చేరుకున్నాయి. దేవాలయాల పరిధిలో ఉన్న కొన్ని భూములను ఎలాంటి భయం లేకుండా అక్రమార్కులు ఆక్రమించుకున్న సంఘటనలు ఉన్నాయి. సామాన్యులకు మాత్రమే దేవుడంటే భక్తి భయం ఉంటున్నాయి. అక్రమార్కులకు ఎలాంటి భయం లేకుండా అప్పనంగా ఆక్రమించుకుని భూములను తమ ఆధీనంలో ఉంచుకుంటున్నారు. అలాంటి వారిపై ప్రభుత్వ పరంగా తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. కొన్ని ప్రాంతాల్లో కొన్ని దేవాలయాలకు ఆదాయం ఎక్కువగా ఉన్నచోట ప్రత్యేకంగా అర్చకులు, కార్యనిర్వహణ అధికారి ఉంటున్నారు. ఆదాయాన్ని బట్టి అర్చకులకు వేతనాలు కూడా ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాలోని దేవాలయాల నిర్వహణ, ఆదాయం, భూముల నిర్వహణ తదితర అంశాలపై జిల్లా దేవాదాయ శాఖ అధికారి బి. నరసింహరాజు ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖి ఇంటర్వ్యూలో పలు అంశాలను వివరించారు.

ప్రశ్న:- జిల్లాలో ఎన్ని దేవాలయాలు ఉన్నాయి? అధిక ఆదాయం ఉన్న దేవాలయాలు ఎన్ని ఉన్నాయి? ఎక్కడెక్కడ ఉన్నాయి?

జవాబు: జిల్లాలో మొత్తం 1139 దేవాలయాలు రిజిస్టర్ అయినవి ఉన్నాయి. వీటిలో ఎక్కువ ఆదాయ కలిగినవి 8 మాత్రమే ఉన్నాయి. అవి కదిరి లక్ష్మీనరసింహస్వామి దేవాలయం, ధర్మవరంలో లక్ష్మీ చెన్నకేశవ స్వామి, పాండురంగ దేవాలయం, దుర్గదేవి దేవాలయం, రామగిరి మండలంలో నసనకోట ముత్యాలమ్మ, హిందూపురంలో వేణుగోపాలస్వామి ఆలయం, పేట వెంకట రమణ స్వామి, బుడ్డం రంగనాథ స్వామి, అనంత పద్మనాభ స్వామి ఆలయాలు, లేపాక్షిలో వీరభద్ర ఆలయం, లేపాక్షి బసవన్న, మడకశిర మండలం బత్తలపల్లి నరసింహస్వామి ఆలయం, హేమావతిలో సిద్దేశ్వర స్వామి ఆలయం, ప్రసిద్ధి చెంది ఉన్నాయి. ఆయా ఆలయాల బట్టి రూ. 5 లక్షల నుంచి రూ. 15 లక్షల పైనే ఆదాయం కలిగి ఉన్నాయి.

ప్ర: అర్చకులకు వేతనాలు ఉంటాయా? ఆదాయం లేని చోట అర్చకుల పరిస్థితి ఏమిటి?

జ: ఆదాయం ఎక్కువగా ఉన్న దేవాలయాలకు కార్య నిర్వహణ అధికారి (ఈవో) ఉంటాడు. దేవాలయాల్లో వచ్చిన ఆదాయం బట్టి అక్కడ అర్చకులకు వేతనాలు ఉంటాయి. అలాగే తక్కువ ఆదాయం ఉన్న దేవాలయాలలో అసలు వేతనాలు ఉండవు. అయితే ఆ దేవాలయాలలో ధూప దీప నైవేద్యం పెట్టడానికి ఆయా దేవాలయాలకు ఉన్న భూములను అర్చకులు అనుభవిస్తూ ఉంటారు. మరికొన్ని చోట్ల అవసరం బట్టి ఆయా దేవాలయాలకు ఉన్న భూములను మూడేళ్లకు ఒకసారి వేలం వేసి వచ్చిన ఆదాయంతోనే ఆ దేవాలయాల ఆలనా పాలనకు వినియోగిస్తుంటారు. ఇవన్నీ కూడా ఆయా గ్రామాల ప్రజల సమిష్టి నిర్ణయం వరకు జరుగుతుంటాయి.

ప్ర: దేవాలయాల క్రింద మొత్తం జిల్లాలో ఎన్ని భూములు ఉన్నాయి? ఆక్రమణదారులపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జ : జిల్లాలో దేవాలయాల ఆధర్వంలో మొత్తం 10,786 ఎకరాల భూములు ఉన్నాయి. వీటిలో సుమారు 500 ఎకరాలు వరకు అన్యాక్రాంతమైన భూములు ఉన్నాయి. ఆక్రమణదారులకు ఇప్పటికే నోటీసులు ఇచ్చాము. వారు స్పందించకుంటే చట్ట ప్రకారం తగు చర్యలు తీసుకుంటాం.

ప్ర: దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం నుంచి నిధులు వస్తాయా?

జ: దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం నుంచి ప్రత్యేకంగా నిధులు మంజూరు కావు. ఎందుకంటే ఆ దేవాలయాలకు భూములు ఉన్నాయి. మరికొన్ని దేవాలయాలలో వార్షిక ఆదాయం రూ. 5 లక్షల నుంచి పది లక్షల రూపాయలకు పైబడి ఆదాయం వస్తుంటాయి. ఆ నిధులతోనే అర్చకుల వేతనాలు చెల్లించబడతాయి. ఆలయాలను నమ్ముకున్న అర్చకులకు ఏదేని ప్రమాదం సంభవిస్తే వారి కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించబడుతుంది. తక్కువ ఆదాయం, లేదా ఆదాయమే లేని దేవాలయాలు ఆ దేవాలయాలకు ఉన్న భూములే ఆధారంగా ఉంటాయి. కొన్ని గ్రామాల్లో అర్చకులే ఆ భూములను అనుభవిస్తూ ఆ గుడి దీప ధూప నైవేద్యం అందిస్తుంటారు. మరికొన్ని గ్రామాల్లో ఆయా గ్రామస్తుల సమక్షంలో భూములు వేలం ద్వారా ఆదాయం సమకూర్చుకోవడం జరుగుతుంది.

జిల్లా దేవాదాయ శాఖ అధికారి నరసింహరాజు

ప్ర : మీ శాఖలో సిబ్బంది కొరత ఉందా? సొంత భవనం ఉందా?

జ : సిబ్బంది కొరత అయితే ఉంది. తమ కార్యాలయంలో 12 మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా ముగ్గురమే ఉన్నాము. అలాగే కార్యనిర్వాహణ అధికారులు (ఈవోలు) 9 మంది ఉండాల్సి ఉండగా అందులో ముగ్గురు మాత్రమే ఉన్నారు. 9 మంది ఈవోల పని ముగ్గురే చేయాల్సి వస్తోంది. ప్రభుత్వానికి నివేదించాము. అలాగే శ్రీ సత్యసాయి జిల్లా నూతనంగా ఏర్పడినందున ఇంకా మా శాఖకు సొంతభవనం అంటూ లేదు. పుట్టపర్తి మండల పరిధిలోని మామిళ్ళకుంట క్రాస్ లో అద్దె భవనంలో కార్యాలయం కొనసాగుతోంది.

ఇంజినీరింగ్ కార్మికుల నిరవధిక దీక్షలు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీల్లో పని చేస్తున్న ఇంజినీరింగ్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఆదివారం అర్ధరాత్రి నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్లనున్నట్లు సిఐటియు మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎటిఎం నాగరాజు, ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ నగర గౌరవాధ్యక్షులు గోపాల్ తెలిపారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఇంజినీరింగ్ కార్మికులు స్థానిక కార్పొరేషన్ కార్యాలయం ఎదుట చేపట్టిన ఆందోళన ఆదివారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా ఇంజినీరింగ్ కార్మికుల సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యం వహించడం బాధాకరమన్నారు. కార్మికులకు వస్తున్న రూ.13వేలతో కుటుంబాలను ఎలా పోషించుకుంటారని ప్రశ్నించారు. పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న లక్షలాది మంది ప్రజలకు కార్మికులు నిత్యం సేవలందిస్తున్నారన్నారు. వీరి సమ్మెతో ప్రజలకు అందాల్సిన, మంచినీరు, వీధి దీపాలు, అనేక రకాల సేవలు దూరమవుతాయన్నారు. ఇందుకు పూర్తి బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు తక్షణమే వేతనాలు పెంచాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ సౌకర్యం కల్పించాలని, చనిపోయిన, అనారోగ్య పాలైన కుటుంబాల్లో ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. ఆప్కాస్ రద్దు చేయాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకుని కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలన్నారు. లేనిపక్షంలో ఈనెల 16న చలో విజయవాడ చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి సంజీవరాయుడు, నగర అధ్యక్ష, కార్యదర్శులు ఓబుళపతి, మురళి, కోశాధికారి పోతులయ్య, శివన్న, సుబ్బిరెడ్డి, రవికిరణ్, సలీమ్, దాదు, రమేష్, గంగిరెడ్డి, మధు, సుధాకర్, వన్నప్ప, మురళి, లక్ష్మి పాల్గొన్నారు.

తాడిపత్రిలో సమ్మె చేస్తున్న కార్మికులు, సిఐటియు నాయకులు

తాడిపత్రి : రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా తాడిపత్రి పాత మున్సిపల్ కార్యాలయం వద్ద ఇంజినీరింగ్ కార్మికులు ఆదివారం సమ్మె ప్రారంభించారు. జీవో నెంబర్ 36 ప్రకారంగా వేతనాలు ఇవ్వాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, తదితర డిమాండ్లపై డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు జుబేర్, కార్యదర్శి శ్రీరాములు, ఉపాధ్యక్షులు మహబూబ్‌బాషా, కోశాధికారి జిపి ప్రసాద్, ఇంజినీరింగ్ కార్మికులు పాల్గొన్నారు. వీరికి పట్టణ సిఐటియు నాయకులు జగన్, ఉమాగౌడ్ పాల్గొని మద్దతు తెలిపారు.

రాయదుర్గం : మున్సిపల్ ఇంజినీరింగ్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులు ఆదివారం నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్లారు. ఇందులో భాగంగా మొదటి రోజు పాత మున్సిపల్ కార్యాలయం వద్ద శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా రాష్ట్రవ్యాప్తంగా ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించలేదన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రానున్న రోజుల్లో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు తిప్పేరుద్ర, కార్మికులు నరసింహులు, బసప్ప, ఇస్మాయిల్, రాము, శివమ్మ, రహంతుల్లా, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్మార్ట్‌మీటర్లను రద్దు చేయాల్సిందే..

సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి-విద్యుత్ భారాలపై ప్రజలకు అవగాహన

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

విద్యుత్ వినియోగదారులకు భారాలు మోపే చర్యల్లో భాగంగా ప్రభుత్వం అమలు చేస్తున్న స్మార్ట్ మీటర్లతోపాటు పెంచిన ట్రూప్ ఛార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఉదయం సిపిఎం ఆధ్వర్యంలో నగరంలోని పలు అపార్ట్‌మెంట్ల యజమానులకు ప్రజలపై పడుతున్న విద్యుత్ భారాలను తెలియజేస్తూ కరపాత్రాలను అందజేశారు. సాయంత్రం ఇందిరా నగర్‌లో ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఇందులో భాగంగా స్మార్ట్ మీటర్ వద్దు- ట్రూ ఆఫ్ చార్జీలు రద్దు చేయాలంటూ సిఎం చంద్రబాబుకు ఫిర్యాదు చేసేలా కరపత్రాల్లో క్యూ ఆర్ కోడ్ ద్వారా ఫిర్యాదు చేయించారు. అనంతరం రామిరెడ్డి మాట్లాడుతూ నివాసగృహాలు, అపార్ట్‌మెంట్‌లకు స్మార్ట్‌మీటర్లు బిగించేందుకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించిందన్నారు. స్మార్ట్ మీటర్లు బిగిస్తున్న వారు అదానీ కంపెనీ ఉద్యోగులే అయినప్పటికీ అపార్ట్‌మెంట్ వాళ్లమంటూ ప్రజలను మభ్యపెట్టి బలవంతంగా బిగించి వెళ్తున్నారన్నారు. పైగా రూ.300 చొప్పున డబ్బులు కూడా వసూలు చేస్తున్నారని ఆరోపించారు. తొలుత ప్రభుత్వ కార్యాలయాలకు, ఆ తరువాత కమర్షియల్ కనెక్షన్‌ల (పరిశ్రమలు, షాపులకు) బిగించారని తెలిపారు. ఇప్పుడు నివాస గృహాలకు బిగిస్తున్నారని మండిపడ్డారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి స్మార్ట్ మీటర్‌ల ఏర్పాటును వ్యతిరేకించాలన్నారు. లేకపోతే పోస్ట్ విధానంలో వినియోగిస్తున్న విద్యుత్ సేవలు ప్రీ పెయిడ్ విధానంలోకి మార్చి ప్రజల నెత్తిన గుదిబండలా భారాలు మోపుతారని తెలిపారు. అనంతరం పలువురు అపార్ట్‌మెంట్‌వాసులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి కరపత్రాల్లో ఉన్న క్యూఆర్ కోడ్ ద్వారా ముఖ్యమంత్రికి ఫిర్యాదులు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఇర్ఫాన్, ఎర్రిస్వామి, లక్ష్మీనారాయణ, లక్ష్మీనరసమ్మ, వరలక్ష్మి, నారాయణ, నాగేంద్ర, బుల్లే రాజు, మోహన్, వెంకటేష్, అంజి, అపార్ట్‌మెంట్ యజమానులు, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురంలో క్యూఆర్ కోడ్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి, నాయకులు

గుంతకల్లు : సెకీ ఒప్పందాలతోపాటు ట్రూఅప్ ఛార్జీలు, స్మార్ట్‌మీటర్లను రద్దు చేయాలని సిపిఎం పట్టణ కార్యదర్శి మారుతీప్రసాద్ డిమాండ్ చేశారు. ఈమేరకు ఆదివారం స్థానిక ట్రావెల్స్ బంగ్లా కూడలిలో క్యూ ఆర్ కోడ్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజల వ్యతిరేకత తెలిజేందుకు సిపిఎం నాయకులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలపై అధిక విద్యుత్తు మోపే విధంగా ప్రవేశపెట్టిన స్మార్ట్ మీటర్లు, ట్రూ అప్ చార్జీలను,సెకి ఒప్పందాలు రద్దు చేయాలని క్యూఆర్ కోడ్ ద్వారా ముఖ్య మంత్రికి దష్టికి తీసుకెళ్లేందుకు ఈ ప్రజా సమస్యలను తీసుకెళ్లేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యవర్గ సభ్యులు జగ్గలి రమేష్, కమిటీ సభ్యులు షాషా, రామునాయక్, జాకీర్, సూరి, బాషా, ఈరన్న, సి.నాగరాజు, రవి, వి.నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న మేథావులు

ఆర్డీటీకి ఎఫ్‌సిఆర్‌ఎను పునరుద్ధరించాలి

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

పేదల పాలిట పెన్నిధిగా ఉన్న రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు (ఆర్డీటీ)కి ఫారిన్ కాంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్ (ఎఫ్‌సిఆర్‌ఎ)ను వెంటనే పునరుద్ధరించాలని పలువురు మేథావులు డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని ఉపాధ్యాయ భవన్‌లో ఆర్డీటీకి ఎఫ్‌సిఆర్‌ఎ పునరుద్ధరణపై చర్చావేదిక నిర్వహించారు. ఈ సమావేశానికి ఉప్పరపాటి వెంకటేశులు, ఎద్దులపల్లి కుమార్ నిర్వహించగా ప్రముఖ రచయిత సంగీత వాణి రాయుడు అధ్యక్షత వహించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పేదల అభ్యున్నతికి ఆర్డీటీ చేపట్టిన సేవా కార్యక్రమాలను గమణించాలన్నారు. గ్రామాల్లో విద్య, ఆరోగ్య సేవలు, ఉపాధి కల్పన వంటి ఆర్డీటీ సేమలు అమూల్యమన్నారు. కావున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్డీటీ సేవలను గుర్తించి వెంటనే ఎఫ్‌సిఆర్‌ఎను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ప్రముఖులు శాంతినారాయణ, వంకిరెడ్డి రెడ్డప్పరెడ్డి, హావాబ్‌ఖాన్, తిప్పేస్వామి, హనుమంతురాయుడు, డాక్టర్ వంశీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

12వ పిఆర్‌సి కమిటీని నియమించాలి

ఆర్థిక బకాయిలను చెల్లించాలి - యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గోవిందరాజులు, లింగమయ్య

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు 12వ పి.ఆర్.సి కమిటీని నియమించాలని, 30 ఐఆర్‌ను ప్రకటించాలని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గోవిందరాజులు, లింగమయ్య డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు ఆర్థిక బకాయిలన్నిటిని వెంటనే చెల్లించాలని ఆదివారం ఉపాధ్యాయ భవన్‌లో యుటిఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఫ్రెండ్లీ ప్రభుత్వం అనీ అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తి చేసుకుని సుపరిపాలన ఉత్సవాలు జరుపుకుంటోందన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయులతో తూచా తప్పకుండా పని చేయించుకుంటోందన్నారు. అయితే ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన పిఎఫ్, ఎపిజిఎల్ఐ, సరెండర్ లీవులు, రిటైర్ అయిన వారికి రావలసిన రూ.20 వేల కోట్ల ఆర్థిక బకాయిల చెల్లింపుల్లో జాప్యం చేయడం సరికాదని, వెంటనే బకాయిలన్ని చెల్లించాలన్నారు. పీఆర్సీ కమిషన్ వెంటనే ప్రకటించాలన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు రమణయ్య కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మెమో 57 ప్రకారం 2003 డీఎస్సీ వారిని పాత పెన్షన్ విధానంలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఉపాధ్యాయులను బోధనేతర పనులకు ఉపయోగించుకోబోమని ఒక వైపు చెబుతూనే మరొక వైపు రకరకాల యాప్‌లతో, వివిధ రకాల శిక్షణలు, ఇతరత్రా కార్యక్రమాలతో ఉపాధ్యాయులను మానసిక క్షోభకు గురి చేస్తోందన్నారు. ఈ చర్యలు ఉప సంహరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సహాధ్యక్షురాలు సరళ, జిల్లా కోశాధికారి రాఘవేంద్ర, జిల్లా కార్యదర్శి హనుమంతురెడ్డి, ప్రమీల, అర్జున్, సంజీవ్ కుమార్, శేఖర్, రాముడు, సుబ్బరాయుడు, ఆడిట్ కమిటీ కన్వీనర్ చంద్రమోహన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు దేవేంద్రమ్మ, రాష్ట్ర కౌన్సిలర్ ఈశ్వరయ్య, వెంకట్రామిరెడ్డి, ఆడిట్ కమిటీ సభ్యులు సూర్యనారాయణ, రాజేంద్ర, రాజశేఖర్, గంగాధర్, సబ్ కమిటీ కన్వీనర్లు రామాంజనేయులు, సురేష్ బాబు, చిత్తప్ప, ఏపీ మోడల్ స్కూల్ నాయకులు వెంకటేశులు, శివానంద వివిధ మండలాల నాయకులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు గోవిందరాజులు

చారిత్రాత్మక గుత్తి కోట అమోఘం

గుత్తి : చారిత్రాత్మక గుత్తి కోటలో నిర్మితమైన కట్టడాలు అమోఘమని జిల్లా ఖజానా అధికారిణి రాణి అన్నారు. గుత్తి కోటను ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి ఆమె సందర్శించారు. ముందుగా కోట వద్ద ఉన్న జిల్లా మొట్ట మొదటి కలెక్టర్ సర్ థామస్ మన్రో సమాధిని సందర్శించారు. సమాధి వద్ద నివాళులు అర్పించారు. అనంతరం గుత్తి కోటలోని కట్టడాలను చూశారు. గుర్రపు శాల,రాణి మహల్, మురారి గద్దె, బురుజులు, ద్వారాలను వీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోటలో కట్టడాలను అద్భుతంగా నిర్మించారని చెప్పారు. కార్యక్రమంలో గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు సి.విజయభాస్కర్, గౌరవ సలహాదారు బాబా, నాయకులు హెచ్‌ఎం జిలాన్, శివ, కోట గైడ్ ఎం.రమేష్, తదితరులు పాల్గొన్నారు.

థామస్‌మన్రో సమాధిని దర్శించుకుంటున్న ఖజానా జిల్లా అధికారిణి రాణి

పూలకుంటలో కొలువుదీరిన పీర్లు

కొలువుదీరిన కుళ్లాయిస్వామి

గుత్తి : మొహర్రం వేడుకల్లో భాగంగా ఆదివారం మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామ పంచాయతీ పూలకుంటలో కుళ్లాయిస్వామి పీర్లు కొలువుదీరాయి. కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా (చిన్న పీర్లపండుగ) పీర్లను ఏర్పాటు చేశారు. 17న చిన్న సరిగెత్తు, 18న విడిదినం, 19న పెద్దసరిగెత్తు, 20న పీర్లను జలదికి తరలించనున్నట్లు సర్పంచి నగరూరు సుమలత రాజశేఖర్, గ్రామ పెద్దలు తెలిపారు.

పంటలబీమా గడువు పొడిగించాలి

బ్రహ్మసముద్రం : ప్రభుత్వం ప్రకటించిన ప్రధానమంత్రి ఫసల్‌బీమా వాతావరణ ఆధారిత పంటల బీమా ప్రీమియం గడువును జూలై 30వ తేదీ వరకూ పొడగించాలని ఎపి రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి బిహెచ్ రాయుడు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. పంటల బీమా నమోదు చేసుకోమని అధికారులు చెబుతున్నా.. ఎక్కడ చెల్లించాలో తెలియక రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. ప్రభుత్వం గ్రామ సభలు నిర్వహించి ప్రీమియం చెల్లింపుపై అవగాహన కల్పించాలని కోరారు.

ఈదురుగాలులకు బీరతోట ధ్వంసం

కళ్యాణదుర్గం రూరల్ : మండలం పరిధిలోని ఎర్రంపల్లి గ్రామానికి చెందిన రైతు ఉల్లి మారుతి సాగు చేసిన బీరతోట ఈదురుగాలులకు ధ్వంసమైంది. బాధిత రైతుల తెలిపిన వివరాల మేరకు.. దాదాపు రూ.3లక్షలు పెట్టుబడి పెట్టి రెండెకరాల్లో బీర పంటను సాగు చేసినట్లు తెలిపారు. ఈనేపథ్యంలో పంట ధ్వంసం కావడంతో తీవ్రంగా నష్టపోయానని వాపోయాడు. ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ధ్వంసమైన బీరపంట

పంచాయతీ కార్మికులకు కనీసం వేతనం ఇవ్వాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్

ప్రజాశక్తి-పామిడి

పంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.21వేలు చెల్లించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని తగ్గు దేవాలయంలో గ్రామ పంచాయతీ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పామిడిని మున్సిపల్ పట్టణంగా మార్చారన్నారు. దీంతో ఇందులో పని చేస్తున్న సిబ్బందికి మున్సిపల్ నిబంధనల ప్రకారం వేతనాలు ప్రతి కార్మికుడికీ రూ.21వేల వేతనం తీసుకున్నారన్నారు. అయితే ఆనాడు పాలకవర్గం అనాలోచిత విధానాల వల్ల మున్సిపల్ కార్మికులు ఔట్‌సోర్సింగ్ ఆప్కాస్ కింద పని చేస్తూ వేతనాలు తీసుకునేవారన్నారు. అయితే తిరిగి గ్రామ పంచాయతీగా మార్చడం వల్ల ప్రస్తుతం రూ.13వేల వేతనం తీసుకుంటున్నార న్నారు. ఫలితంగా కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.21 వేలు చెల్లించాలని, 132, 142, 680 జీఓలు, టెండర్లపై హైకోర్టు తీర్పు అమలు తదితర డిమాండ్ల పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఇకపోతే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ తీసుకొస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలు పెరుగుదల, స్మార్ట్ మీటర్ల వ్యతిరేకంగా కరపత్రాలు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు మల్లేష్, నల్లప్ప, నల్లమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు విడుదల చేస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

వైసిపికి సోషల్ మీడియానే బలం

జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి సోషల్ మీడియానే బలం అని వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. ఆదివారం అనంతపురంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో సోషల్ మీడియా విభాగం జిల్లా అధ్యక్షులు నరేంద్రనాథ్‌రెడ్డి అధ్యక్షతన జిల్లా సోషల్ మీడియా కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా ఈనెల 20వతేదీ నుంచి ప్రారంభం కానున్న 'రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో'కు సంబంధించి పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014లో ఓడిపోయాక పార్టీ ఉండదని అంతా భావించారన్నారు. అయితే అప్పుడు బలంగా నిలబడింది కార్యకర్తలే అన్నారు. గతంలో జగన్‌ను వ్యక్తిగతంగా విమర్శిస్తే సోషల్ మీడియా ద్వారా సమర్థవంతంగా తిప్పికొట్టామన్నారు. ఇప్పుడు కూడా మనం ఓడిపోయినా 42 శాతం ఓట్లు వచ్చాయన్నారు. దీన్నిబట్టి మనం ఎంత బలంగా ఉన్నామో అర్థం చేసుకోవాలన్నారు. ప్రజాస్వామ్యంలో గెలుపోటములు సహజం అని.. అయితే ఎవరూ నిరుత్సాహ పడకుండా సోషల్ మీడియాను ఆయుధంగా మార్చుకుని ముందుకు వెళ్దామని పిలుపునిచ్చారు. సూపర్ సిక్స్ హామీలపై చంద్రబాబు చేస్తున్న మోసాలను 'రీకాలింగ్' ద్వారా ప్రజలకు వివరిద్దామన్నారు. ఈ కార్యక్రమంలో సోషల్ మీడియా టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యుడు రమేష్‌గౌడ్, వైసిపి నగర అధ్యక్షుడు చింతా సోమశేఖరరెడ్డి, బూత్ కమిటీ జిల్లా అధ్యక్షుడు ఎద్దుల అమర్నాథ్‌రెడ్డి, నాయకులు రాధాకృష్ణ, వెన్నం శివారెడ్డి, బాబాసలాం, యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు దాదాఖలందర్, జెడ్పీటీసీ నీలం భాస్కర్, ఇంటెలెక్చువల్ ఫోరం తానీషా, కల్చరల్ విభాగం నగర అధ్యక్షుడు కేశవరెడ్డి పాల్గొన్నారు.

దళిత, గిరిజనులపై దాడులు అరికట్టాలని వినతి

కళ్యాణదుర్గంటౌన్ : దళిత, గిరిజనులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, కులవివక్షతను రూపుమాపాలని ఎస్సీ, ఎస్టీ జెఎసి నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు ఆదివారం స్థానిక రూరల్ సీఐ కార్యాలయంలో పోలీసు సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ జెఎసి నాయకులు చెలిమప్ప, రామన్న, వెంకటేశులు, జాకీ రామన్న, మాకోడి గంగాధర్, మహేష్, వన్నూరుస్వామి, పరులువు మహిళలు శెట్టూరు మండలం మాకోడికిలో పీర్లపండగ సందర్భంగా దళితులకు జరిగిన అవమానంపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. పీర్ల చావిడి లోపలికి వెళ్లేందుకు దళిత గంగాధర్ ప్రయత్నించగా అదేగ్రామానికి చెందిన బీసీ సామాజికవర్గం వన్నూరుస్వామి, గోవిందప్ప, రామాంజనేయులు అడ్డుకుని దాడి చేయడంతోపాటు అవమానకరంగా వ్యవహరించారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే బాధ్యులపై చర్యలు తీసుకుని దళితులకు న్యాయం చేయాలని కోరారు.

వైసిపి కార్యకర్తకు ఆర్థికసాయం

ఆర్థికసాయం అందిస్తున్న ఆలూరు సాంబశివారెడ్డి

నార్పల : అనారోగ్యంతో బాధపడుతున్న నార్పల మండలం బొందలవాడ గ్రామానికి చెందిన వైసిపి కార్యకర్త కుటుంబానికి వైసిపి ఎన్ఆర్ఐ గ్లోబల్ వింగ్ కో ఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డి ఆదివారం ఆర్థికసాయం అందజేశారు. బొందలవాడ ఎస్సీ కాలనీకి చెందిన నారాయణ ఇటీవల జరిగిన ప్రమాదంలో గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న సాంబశివారెడ్డి బాధితుడికి అనంతపురంలోని నివాసంలో రూ.20వేలు ఆర్థికసాయం అందజేశారు.

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

ఉరవకొండ : విడపనకల్లు మండల పరిధిలోని పాల్తూరులో ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి సహకారంతో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు గ్రామస్తులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాల్తూరు గ్రామంలోని సచివాలయం వద్ద ఉదయం 10 గంటలకు సుశీల నేత్రాలయ, సాయి ఎడ్యుకేషనల్ సొసైటీ కర్నూలు వారిచే నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కెనాల్‌లో కంపచెట్ల తొలగింపు

యాడికి : ఎమ్మెల్యే జెసి అస్మిత్ రెడ్డి ప్రత్యేక చొరవతో ఆదివారం పెద్దవడుగూరు ప్రధాన కాలువ నుంచి యాడికి బ్రాంచి కెనాల్ వరకూ టిడిపి నాయకులు కాలువలో పూడికతీత, ముళ్లపొదలను తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కిష్టిపాడు హెడ్ రెగ్యులేటర్, రాయలచెరువు చెరువు, యాడికి మండలంలోని వ్యవసాయ ఆధారిత భూగర్భజలాలు పెరిగేందుకు ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి తన సొంత నిధులతో చర్యలు చేపట్టినట్లు వివరించారు. ఆయా పనులను మాజీ ఎంపిపి వేలు రంగయ్య, పరిమి చరణ్, రవికుమార్‌రెడ్డి తదితరులు పరిశీలించారు.

'కూటమి' ప్రభుత్వంపై ప్రజల్లో హర్షం

'తొలిఅడుగు'లో నాయకులు

ప్రజాశక్తి-పుట్లూరు

ఏ ఇంటికి వెళ్లినా ఏడాది కూటమి ప్రభుత్వంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అన్నారు. ఆదివారం మండలంలోని తక్కలపల్లి గ్రామంలో 'సుపరిపాలనలో తొలిఅడుగు - ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు, చేస్తున్న అభివృద్ధిని వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. ఇచ్చిన హామీలన్నీ ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామన్నారు. అయితే వైసిపి నాయకులు మాత్రం అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓర్వలేక బురదజల్లే కార్యక్రమాలు చేపడుతున్నారని విమర్శించారు. ఇప్పటికే మెగా డీఎస్సీ పూర్తి చేశామని, అన్నా క్యాంటీన్ ద్వారా పేదల కడుపు నింపుతున్నామని, ఉచిత ఇసుక అందజేశామని, అమ్మఒడి అమలు చేశామని, త్వరలోనే రైతులకు అన్నదాత సుఖీభవ కింద నగదు జమ చేయనున్నట్లు తెలిపారు. అనంతరం ఉపాధి నిధుల ద్వారా నిర్మించిన గోకులం షెడ్‌ను ప్రారంభించారు. తర్వాత గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ ఇప్పటికే నియోజకవర్గ వ్యాప్తంగా గ్రామాలకు బిటి రోడ్లు, సిసి రోడ్లు, డ్రెయినేజీలు, గోకులం షెడ్ల నిర్మాణం వంటి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేశామన్నారు. ముఖ్యంగా తక్కలపల్లిలో రూ.5లక్షలతో సిసి రోడ్డు, రూ.9లక్షలతో 5 గోకులం షెడ్లు, రూ.60వేలతో 2 పశువుల తొట్లు, రూ.11లక్షలతో 14 ఫారంపాండ్లను నిర్మించామని తెలిపారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించి పిల్లలు, గర్భిణులకు అందిస్తున్న సేవలపై ఆరాతీశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బాల రంగయ్య, సుదర్శన్‌నాయుడు, ఎల్కే చెన్నారెడ్డి, కోమటికుంట్ల కులశేఖర్‌రెడ్డి, కడవకల్లు గోవర్ధనరాజు, బాలాపురం రామచంద్రారెడ్డి, గోపరాజుపల్లి రవికుమార్‌రెడ్డి, గూడూరు విజయ్‌కుమార్‌రెడ్డి, బ్రహ్మయ్య, శ్రీపతినాయుడు, శివారెడ్డి, వాసుదేవరెడ్డి, రామచంద్రనాయుడు, రామానాయుడు, తాజ్, శివనారాయణరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, ప్రసాద్, వేణు, తిప్పారెడ్డి, రంగయ్య, గోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

అనంతపురం కలెక్టరేట్ : 30 ఏళ్లుగా అనంతపురం రాజీవ్‌కాలనీతో పాటు పరిసర ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బంది పడుతున్న డంపింగ్ యార్డు సమస్యకు వారంరోజుల్లో పరిష్కారం చూపించబోతున్నామని ఎమ్మెల్యే దగ్గపాటి ప్రసాద్ తెలిపారు. ఆదివారం నగరంలోని రాజీవ్‌కాలనీలో 'సుపరిపాలనలో తొలి అడుగు - ఇంటింటికీ టిడిపి' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ఏడాది కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రసాద్ మాట్లాడుతూ గత ఐదేళ్లలో వైసిపి నాయకులు రాజీవ్ కాలనీ ని పూర్తిగా విస్మరించడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఇక్కడ విద్యుత్ సమస్యను పరిష్కరించమన్నారు. డంపింగ్ యార్డుకు శాశ్వత పరిష్కారం చూపించే విధంగా చెత్త తరలిస్తున్నట్లు తెలిపారు. అక్టోబర్ 2వతేదీ నాటికి తరలిస్తామన్నారు. అలాగే గుత్తి రోడ్డు నుంచి రాజీవ్ కాలనీకి లింక్ రోడ్డు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు హరి, లింగమయ్య, సాదిక్, మాబు, శోభ, చౌడయ్య, బుగ్గయ్య చౌదరి, డిష్ నాగరాజు, సరిపూటి రమణ, సుధాకర్‌యాదవ్, కార్పొరేటర్ బాలాంజనేయులు, మాజీ కార్పొరేటర్ బల్లా పల్లవి, నెట్టెం బాలకృష్ణ, దాదాపీర్, బాబు, గోపాల్, ఖాసీం, రజాక్, రహీమ్, నబీరసూల్, వెంకటేశులు, నాగరాజు, సాంబశివుడు, ధనమూర్తి, కృష్ణమూర్తి, జి.అశోక్, ప్రభాకర్, జిలాన్‌బాషా, అశోక్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్ : మండలంలోని తూర్పు కోడిపల్లి గ్రామంలో 'సుపరిపాలనలో-తొలి అడుగు' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు, చేస్తున్న అభివృద్ధిని వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఇందులో భాగంగా ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన చౌడప్పను పరామర్శించి రూ.10 వేలు ఆర్థికసాయం అందించారు. తర్వాత ఎస్సీ కాలనీలో డయాలసిస్ వ్యాధితో మృతిచెందిన వెట్టి మల్లేష్ కుటుంబానికి రూ.5వేలు అందజేశారు. తర్వాత ఇటీవల మృతిచెందిన కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించి కుమార్తె వర్షకు ఉచితంగా నర్సింగ్ విద్య అందించేందుకు కళాశాల యాజమాన్యంతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేస్తున్న కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని

కరపత్రం అందజేస్తున్న అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి

నేరాలు ఘోరాలు

పాముకాటుతో వ్యక్తి మృతి

మృతిచెందిన రామాంజి

బ్రహ్మసముద్రం : మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కురుబ రామాంజి (50) పాముకాటుతో మృతిచెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. మలకల్మూరు తాలూగా నాగసముద్రం గ్రామానికి చెందిన కురుబ మచ్చేంద్రప్ప కుమారుడు రామాంజి 15 ఏళ్ల క్రితం బ్రహ్మసముద్రం మండలం నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కంబదూరు వెంకటేశులు వ్యవసాయ తోటలో కూలి పని చేసుకుంటూ జీవనం సాగివాడు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం తోటలోని వెంకటేశులు ఇంటి ముందు ఏదో చేతికి గాయం తగిలినట్లు అనిపించింది. కొంతసేపటికి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. అక్కడున్న వారు తక్షణమే కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ పాముకాటు అని చెప్పడంతోపాటు పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం ఉదయం మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కుమారుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేంద్రకుమార్ తెలిపారు.

బంగారు గొలుసు చోరీ

పుట్లూరు : సాయంత్రం వాకింగ్ వెళ్తున్న మహిళ మెడలో నుంచి బంగారు గొలుసు లాక్కెళ్లిన ఘటన మండల పరిధిలోని కందిగోపుల గ్రామ సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన సులోచన రోజూ మాదిరిగానే ఆదివారం సాయంత్ర ఎర్రగుంటపల్లి రోడ్డు వెంబడి నడుస్తూ వెళ్తుండగా ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంలో వచ్చి మెడలోని గొలుసు ప్రయత్నించారు. అయితే సులోచన కింద పడటంతో దుండుగులు ద్విచక్ర వాహనం దిగి కత్తి చూపి బెదిరించి రెండున్నర తులాల బంగారు గొలుసును ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు తెలిపింది.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలు

గుత్తి : మండలంలోని కొత్తపేట గ్రామ శివారులో 44వ జాతీయ రహదారిపై ఆదివారం బస్సు, లారీ ఢీకొన్న ప్రమాదంలో ఓ డ్రైవరుకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తమిళనాడులోని రాణిపేట్ నుంచి గుల్బర్గాకు చర్మాల లోడుతో వెళ్తున్న లారీ ఎదురుగా వెళ్తున్న బస్సు అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో వెనుక వెళ్తున్న ఢీకొంది. ప్రమాదంలో తమిళనాడు రాష్ట్రంలోని చిదంబరంకు చెందిన లారీ డ్రైవర్ రాజేష్ కు గాయాలయ్యాయి. తీవ్ర గాయాలైన రాజేష్‌ను వెంటనే చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్సకు అనంతపురం తీసుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.